## క్లుప్తంగా

### క్యాటిల్ షెడ్లు పూర్తి చేయించండి

**సంతనూతలపాడు:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులచే క్యాటిల్ షెడ్లను సత్వరమే పూర్తి చేయించాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు సూచించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనులను అన్ని గ్రామ పంచాయతీలలో వెంటనే ప్రారంభింపజేయాలని ఎంపీడీవో సురేష్ బాబు ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన పనులకు సంబంధించి ఎస్టిమేట్లను వెంటనే సిద్ధం చేయాలన్నారు. మంజూరైన సోక్ పిట్స్‌ను అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రౌండింగ్ చేయాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రతిరోజూ పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం వాసంతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### 35 మందికి వైద్య పరీక్షలు

**సంతనూతలపాడు:** మండల కేంద్రంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏఆర్సీ ఫెర్టిలిటీ సెంటర్ సహకారంతో బుధవారం సంతాన సాఫల్యత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఆర్సీ ఫెర్టిలిటీ సెంటర్ కన్సల్టెన్సీ డాక్టర్ కొండారెడ్డి, రాధిక హాజరై 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రతి బుధవారం సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పాతూరి సంపత్, చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో పేదలకు ఏర్పాటు చేస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా దాదాపు 350 మందికి అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు హాజరవగా, ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సంఘాల నాయకులు

**ఒంగోలు సిటీ:** కొండపిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముండ్లమూరు మండలంలోని శంకరాపురం గ్రామస్తులైన గిరిజన యువకులు దుర్మరణం చెందారని, వారి కుటుంబ సభ్యులకు తక్షణమే ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ బుధవారం డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, రైతు సంఘ నాయకుడు ఎర్రయ్య ఒంగోలు జీజీహెచ్‌లో చనిపోయిన వారి మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే చనిపోయిన గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### కళాకారులకు సన్మానం



బాలకోటయ్యను సన్మానిస్తున్న సర్పంచ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం, నటరాజ కళా కేంద్రం సభ్యులు

**మద్దిపాడు:** అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక నటరాజ కళా కేంద్రం సభ్యులు వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ అక్కినేని శతజయంతి సందర్భంగా కళలకు విశేష సేవ చేస్తున్న స్థానిక పీహెచ్సీ సూపర్‌వైజర్ బాలకోటయ్యను మద్దిపాడు సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఘనంగా సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో యల్లమంద, సుబ్బారావు, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

### బిల్డర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

**ఒంగోలు మెట్రో:** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా శాఖ వారి 2025 సంవత్సరం డైరీని బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు. అసోసియేషన్ వారు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్లూరి అజయ్‌కుమార్‌ఘోష్, కార్యవర్గ సభ్యుడు వాకా సంజీవరెడ్డి, రాష్ట్ర సలహాదారు రామచంద్ర ప్రసాద్, కాంట్రాక్టర్ కొట్టే కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో విఫలం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ధ్వజం

**ఒంగోలు సిటీ:** సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ధ్వజమెత్తారు. ఒంగోలు మండల పరిధిలోని గుడిమిండ్లపాడు గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా త్రోవగుంట కంపెనీల సెంటర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి చుండూరు రవిబాబు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులన్నీ బూటకమేనన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారే తప్ప.. సమస్యలేవీ పరిష్కారం కావడం లేదన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలనాకాలంలో ఆరోగ్యం, విద్యను పూర్తిగా విస్మరించిందన్నారు. గత ప్రభుత్వంలో రాజకీయాలకు, పార్టీలకు సంబంధం లేకుండా 60 ఏళ్లు నిండితే వలంటీరు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయంలో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్ల ఊసే లేదన్నారు. ఇంతవరకు ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదు సరికదా.. కనీసం పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదన్నారు. అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లను తొలగించడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాయపాటి అంకయ్య, రాయపాటి శ్రీమాన్, ఖాన్, సూదనగుంట రామకృష్ణ, దాసు వెంకటరావు, పులుసు సురేష్‌బాబు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు

**సంతనూతలపాడు:** మండలంలోని గురువారెడ్డిపాలెం, ఎం.వేములపాడు గ్రామాల్లో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. సుమారు 1,803 పశువులు, గొర్రెలు, మేకలకు వివిధ వ్యాధుల నివారణకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేసినట్లు పశు వైద్యాధికారులు డాక్టర్ బి.ప్రతాపరెడ్డి, డాక్టర్ పి.చిరంజీవి తెలిపారు. గురువారెడ్డిపాలెం గ్రామంలో 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. వేములపాడు గ్రామంలో 1,050 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. ఆయా గ్రామాల్లో 156 దూడలు, ఆవులు, గేదెలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. 98 పశువులకు చికిత్స చేశామన్నారు. పశు పోషకులకు మందులు పంపిణీ చేశారు. పాల దిగుబడి పెంపునకు సంబంధించి సలహాలు, సూచనలు చేశారు. పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దిరాలపాడులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేడీ బేబీరాణి



సంతనూతలపాడు: పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

**మద్దిరాలపాడులో...**

**నాగులుప్పలపాడు:** పశువుల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల నిర్ధారణ అనేది చాలా అవసరమని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి అన్నారు. బుధవారం మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 20 గేదెలకు సాధారణ వ్యాధులకు, 16 గేదెలకు గర్భకోశ వ్యాధులకు, 14 దూడలకు, 25 గేదెలకు, 350 గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో గ్రామ సర్పంచ్ స్వర్ణ అనూరాధ, ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, ఏడీఏ డాక్టర్ నాగభూషణరావు, పశు వైద్యులు అనూరాధ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాకవి జాన్‌కు ఘన నివాళులు



చీమకుర్తి: జాన్‌కు నివాళులర్పిస్తున్న డాక్టర్ జవహర్

**చీమకుర్తి:** ప్రజాకవి మల్లవరపు జాన్‌కు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ బుధవారం ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో గ్రేడ్-1 తెలుగు పండిట్‌గా స్వయంగా రచించిన పద్యాలను రేడియోలలో స్వరగానం చేసి మధుర కవిగా పేరుగాంచిన మల్లవరపు జాన్ సేవలు తెలుగు సాహిత్యంలో అలరించాయని గుర్తు చేసుకున్నారు. అనేక నాటికలు, నాటకాలను రచించిన మల్లవరపు జాన్ సాహితీ రంగంలో రాష్ట్రస్థాయిలో పేరుప్రతిష్టలను ఇనుమడింపజేసినట్లు డాక్టర్ జవహర్ ఈ సందర్భంగా కొనియాడారు. తొలుత చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో జాన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షుడు పాటిబండ్ల రాజసులోచన, చలువాది రమేష్, పిన్నిక శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

**ఘనంగా జాన్ కవి, ఎండ్లూరి సుధాకర్ జయంతి**

**ఒంగోలు సిటీ:** పద్య కవుల్లో ప్రజాకవి మల్లవరపు జాన్ అని న్యాయవాది, సామాజిక వేత్త అట్లూరి రాఘవులు అన్నారు. బుధవారం ప్రముఖ పద్యకవి, మధురకవి మల్లవరపు జాన్, ప్రముఖ కవి ఎండ్లూరి సుధాకర్ సాహితీ జయంతి సభను ఒంగోలు జానుడి సాహిత్య కేంద్రంలో నిర్వహించారు. జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యావేత్త ఎద్దు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. జానుడి డైరెక్టర్ డాక్టరు నూకతోటి రవికుమార్ సంచాలకత్వం వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాఘవులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన జాన్ మాస్టారు కవిగా ఎన్నో ప్రయోజనకర కవిత్వాలను సృష్టించారన్నారు. ప్రజా గాయకుడు సురేష్ పాడిన గీతాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో బహుజన కెరటాలు ప్రతినిధి చప్పిడి కోటేశ్వరరావు, అసోసియేషన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ప్రతినిధి జాన్‌సామ్యూల్, న్యాయవాది ఆడే రామసుబ్బారావు, లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు దారా మోహన్, బ్రహ్మయ్య, సాయిరాజేష్, సాహిత్య పరిశోధకుడు నోసిన వెంకటేశ్వర్లు, శానం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పంపిణీ

**సంతనూతలపాడు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు కిరణ్, హేమంత్‌కు హైస్కూల్ పూర్వ విద్యార్థి, దాత వాయల మోహన్‌రావు బుధవారం ప్రోత్సాహక నగదు కింద రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కొత్రపాటి సుధాకర్ పాల్గొని మాట్లాడారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలలో 5 విభాగాలలో బహుమతులు సాధించిన సంతనూతలపాడు హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులు యామిని, వైష్ణవి, వైశాలి, ఉమామహేశ్వరి, నాగ ప్రియాంకలను హెచ్‌ఎం ప్రమోద అభినందించారు. వీరికి గైడ్ టీచరుగా వ్యవహరించిన హైస్కూల్ ఉపాధ్యాయురాలు వజ్రాల మాధవీలతను అభినందించారు. గతేడాది 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ముందంజలో నిలిచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయురాలు ఎం.ఉమామహేశ్వరిని దాత మోహనరావు, వైద్యుడు సుధాకర్ అభినందించి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మోహన్‌రావు, తదితరులు

## కోదండ రామయ్యకు ప్రత్యేక పూజలు

**ఒంగోలు మెట్రో:** అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగి బుధవారానికి ఏడాది పూర్తవడంతో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఒంగోలు నగరంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఘడియారంవారివీధిలోని అనంత కోదండ రామస్వామి మందిరంలో, ఐశ్వర్యనగర్‌లోని రామాలయంలో, గాంధీరోడ్డులోని అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో, గోపాల్ నగర్‌లోని రామమందిరంలో, సీతారాంపురంలోని సీతా సమేత అనంత కోదండరామస్వామి దేవాలయంలో, మంగమూరు రోడ్డు గాంధీనగర్ మూడో లైన్‌లోని సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో, రాంనగర్, మామిడిపాలెం, గద్దలగుంట రామాలయాలలో, ఇంకా వివిధ ఆలయాలలో స్వామివారు, అమ్మవార్ల మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ భజనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



పూజలందుకుంటున్న సీతా సమేత కోదండరామస్వామి

## 27న నాగులుప్పలపాడు మండల సర్వసభ్య సమావేశం

**నాగులుప్పలపాడు:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## నూనెలో పడిన వృద్ధురాలు మృతి

**కొత్తపట్నం:** కాగుతున్న నూనెలో పడిన చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామానికి చెందిన సోలా గోవిందమ్మ (80) తన కుమార్తె దుర్గా మల్లేశ్వరి, మనుమరాలు విజయలక్ష్మితో కలిసి ఈ నెల 14న సంక్రాంతి పండుగ సందర్భంగా పిండివంటలు చేసింది. అనంతరం పూజ చేసుకోవడానికి గదిలోకి వెళ్లే సమయంలో కాలు జారి అప్పటివరకూ పిండివంటలు చేసి కాలుతున్న నూనెలో పడింది. కాలు, తొడ, పొట్ట బాగా కాలిపోయి పుండ్లు పడ్డాయి. 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 21వ తేదీ మరణించింది. జీజీహెచ్ నుంచి వచ్చిన నివేదిక ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై సుధాకర్‌బాబు తెలిపారు.

# కూటమి హయాంలో ఒంగోలు అభివృద్ధి శూన్యం

- సీపీఎం నాయకుల విమర్శ





మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు

**ఒంగోలు సిటీ:** ఒంగోలు నగర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు జి.రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు మాసాలైనా అభివృద్ధి వైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. ఒంగోలు నగరంలో తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలతో పాటు మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయన్నారు. ప్రతిరోజూ తాగునీరు అందిస్తామని వాగ్దానం చేసిన పాలకులు ఆ మాట మర్చిపోయారన్నారు. ప్రధాన వీధుల్లోనే పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్నారని, శివారు కాలనీలు, మురికి వాడల్లో కూడా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. నగరంలో 150 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, కేవలం 120 టన్నులు మాత్రమే తరలిస్తున్నారని, మిగిలిన 30 టన్నులు ఎక్కడిదక్కడే పేరుకుపోతోందని అన్నారు. నగరంలో లక్షలమందికి సొంతిళ్లు లేక శివారు కాలనీల్లో అద్దెలకు నివసిస్తున్నారన్నారు. పార్కుల సుందరీకరణ పేరుతో నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం సరికాదన్నారు. నగరపాలక సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. సుందరయ్య భవన్ రోడ్డులో ఏర్పాటుచేసిన డివైడర్ ప్రక్రియ రోగులకు ఇబ్బందిగా ఉందన్నారు. వెంటనే సరిచేయాలన్నారు. శివారు కాలనీల్లో 7 లేదా 8 రోజుల వరకు తాగునీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదని, ట్యాంకర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసే ప్రక్రియను నిలిపివేశారని అన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# శనగ పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



తొర్రగుడిపాడులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



రుద్రవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ పావని

**సంతనూతలపాడు:** మండలంలోని రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి పి.పావని పలు గ్రామాల్లో సాగు చేసి ఉన్న శనగ పంటను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలు వివరించారు. రుద్రవరం గ్రామంలో సాగు చేసిన వరి పొలంలో ఎన్పీఎస్ఎస్ యాప్లో పంటస్థితి, చీడపీడల ఉధృతి వివరాలు నమోదు చేశారు. అనంతరం సూపర్ చెక్ తనిఖీ నిమిత్తం రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాల్లో శనగ, పొగాకు పంటలను, ఈ పంటలో నమోదు చేసిన రైతుల వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాల వ్యవసాయ సహాయకులు సీహెచ్ నిఖిల్, పి.సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

**తొర్రగుడిపాడులో...**

**చీమకుర్తి రూరల్:** మండలంలోని తొర్రగుడిపాడు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ గ్రామంలోని పొలాలను సందర్శించి వరిపంటను పరిశీలించారు. ఆయన మాట్లడుతూ పంట వేసిన ప్రతి రైతు ఈ పంటలో వివరాలు నమోదు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డ్ తీసుకోవాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందులు పిచికారీ గురించి వివరించారు. టెక్నికల్ వ్యవసాయ అధికారి రైతులకు ఎన్పీఎస్ఎస్ యాప్ ఉపయోగించే విధానాన్ని వివరించారు. జిల్లా కార్యాలయ టెక్నికల్ వ్యవసాయ అధికారి కాంచన, వ్యయసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# బీఎల్వోలు నూతన ఓటర్లకు కార్డులివ్వాలి



మద్దిపాడులో బీఎల్వోలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సుజన్ కుమార్



నాగులుప్పలపాడులో బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

**మద్దిపాడు:** మండలంలో నూతనంగా ఓటు కోసం నమోదు చేసుకున్న వారికి ఈ నెల 25న ఓటర్ కార్డులు అందించాలని తహసీల్దార్ సుజన్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి బీఎల్వో పోలింగ్ బూత్లో అందుబాటులో ఉండి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు.

**నాగులుప్పలపాడులో...**

**నాగులుప్పలపాడు:** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈ నెల 25వ తేదీ ప్రతి పోలింగ్ బూత్‌లో ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో బీఎల్‌వోలకు పలు సలహాలు, సూచనలు చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజు ప్రతి బీఎల్‌వో తప్పకుండా పోలింగ్ బూత్‌లో ఉండాలని, కొత్త ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు.

## సెగ్గంకు అభినందనలు

**ఒంగోలు అర్బన్:** బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సెగ్గం శ్రీనివాసరావుకు బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెముల మోజీ, రాష్ట్ర నాయకుడు వీరభద్రాచారి, తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మోజీ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో జిల్లా నూతన అధ్యక్షుడితో పార్టీ బలోపేతం అవుతుందన్నారు.